

ప్రాజెక్టులు తయారు చేయండి: డీఈవో

కలెక్టరేట్, ఆగస్టు 20: ఇన్‌స్పైర్ మానక్ కోసం ప్రాజెక్టులు తయారు చేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పీఎస్ఆర్ స్కూల్‌లో సైన్సు టీచర్ల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులను ఈనెల చివరిలోగా నమోదు చేయాలన్నారు. ఐదు ప్రాథమి కోన్నత పాఠశాలల నుంచి మూడు ప్రాజెక్టులు చొప్పున ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మిరియాల కృష్ణారావు, రిసోర్స్ పర్సన్‌లు ఉమామహేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- ఎన్టీఆర్ ఇళ్ల లబ్ధిదారులకు భరోసా
- బకాయి బిల్లుల చెల్లింపులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం చంద్రబాబు
- జిల్లాలో 5,186 ఇళ్లకు రూ.15.52 కోట్లు ఇచ్చే అవకాశం
- ప్రభుత్వానికి జిల్లా అధికారుల నివేదిక



గజపతినగరం మండలం గంగచోళ్లపెంటలో ఎన్టీఆర్ ఇళ్లు



ఐదేళ్ల ఎదురుచూపులు ఫలించనున్నాయి. ఎన్టీఆర్ ఇళ్ల లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. బకాయి పడిన బిల్లులను చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారు. త్వరలోనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా నుంచి ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. జిల్లాలో 5,186 ఇళ్ల లబ్ధిదారులకు రూ.15.52 కోట్లు అందనున్నాయి. బిల్లులు అందితే అప్పులు తీరిపోతాయని, వడ్డీల భారం మోయలేకపోతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)

ఏ ప్రభుత్వం అమలు చేసిన పథకాలైనా తర్వాత వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. వైసీపీ ప్రభుత్వం మాత్రం ఇందుకు భిన్నం. పాత పథకాలన్నింటికీ నిర్దాక్షిణ్యంగా బ్రేక్ వేసింది. ఆ కోవలోందే ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కూడా. 2019 ఎన్నికలు సమీపించేసరికి అనేక ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. పగ్గాలు చేపట్టిన అప్పటి సీఎం జగన్ కనీసం పట్టించుకోలేదు. 2014-19 మధ్య నిర్మించిన ఇళ్లకు రకరకాల కారణాలు చూపుతూ పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. దీంతో ఐదేళ్లుగా లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇళ్లకు బిల్లుల చెల్లింపునకు కసరత్తు మొదలైంది. ఆ ఇళ్ల బిల్లులు మంజూరు చేస్తామని ఇటీవలే సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్ని జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. ఈ మేరకు విజయనగరం జిల్లాలో 5,186 ఇళ్లకుగాను రూ.15.52 కోట్లు చెల్లించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఈ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.

చివరి ఏడాదిలో పెండింగ్..

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకాన్ని ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసింది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సబ్‌ప్లాన్ నిధులను రూ.70 వేల నుంచి లక్ష రూపాయల వరకూ అదనంగా మంజూరు చేసింది. అయితే 2014 నుంచి 2017 వరకూ మంజూరైన ఇళ్లకు బిల్లుల చెల్లింపులు సక్రమంగానే జరిగాయి. అటు తరువాత బిల్లుల చెల్లింపులో కాస్త జాప్యం జరిగింది. ఇంతలో ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పెండింగ్ బిల్లుల అంశాన్ని పక్కన పడేసింది. అప్పటి నుంచి లబ్ధిదారులు మంచి రోజులు రాకపోతాయా అని ఎదురుచూస్తున్నారు.

బిల్లుల పేరిట కలెక్షన్లు..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక నాయకులు చాలాచోట్ల కలెక్షన్ల పర్వానికి దిగారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో భాగంగా నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయిస్తామని చాలా గ్రామాల్లో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయితే జగన్ సర్కారు నుంచి ఉలుకూపలుకూ లేకపోవడంతో లబ్ధిదారులు నిలువునా మోసపోయారు. అటు బిల్లులు రాక.. ఇటు నేతలకు కొంత వరకూ సమర్పించుకొని రెండింటికీ చెడ్డ రేవడిగా మారిపోయారు. జిల్లాలో ఎక్కువగా రాజాం నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో చెల్లింపులు ఉండిపోయాయి. అత్యల్పంగా విజయనగరం నియోజకవర్గంలో 68 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ బిల్లుల బకాయిల సంగతి తేలడంతో అధికారులు ఇంటింటా పరిశీలన చేయనున్నారు. లబ్ధిదారులకు చెల్లించింది ఎంత.. బకాయి ఎంత ఉంది.. అన్నది తేల్చనున్నారు. అటు తరువాతే లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది.

ఎన్టీఆర్ ఇళ్లకు చెల్లించాల్సిన బిల్లులు..

నియోజకవర్గం	లబ్ధిదారులు	బిల్లులు
రాజాం	531	4.2 కోట్లు
బొబ్బిలి	803	2.31 కోట్లు
నెల్లిమర్ల	762	2.52 కోట్లు
చీపురుపల్లి	498	1.53 కోట్లు
విజయనగరం	192	68 లక్షలు
ఎస్.కోట	662	1.99 కోట్లు
గజపతినగరం	642	1.97 కోట్లు

త్వరలో నిధులు..

జిల్లాలో సర్వే పూర్తయ్యింది. 5,186 ఇళ్లకుగాను రూ.15.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం వద్ద కూడా సమగ్ర సమాచారం ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. కొద్దిరోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభంకానుంది.

-వి.శ్రీనివాస్, హౌసింగ్ పీడీ, విజయనగరం



సిరిమానోత్సవం

ముహూర్తం ఖరారు

- అక్టోబరు 14న తొలేళ్లు.. 15న సిరి సంబరం
- సెప్టెంబరు 30న మండల దీక్షలు ప్రారంభం

విజయనగరం రూరల్, ఆగస్టు 20: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, సిరులతల్లి పైడిమాంబ సిరిమానోత్సవ తేదీలు ఖరారయ్యాయి. అక్టోబరు 14న తొలేళ్లు.. 15న సిరి సంబరం జరుగనున్నాయి. ఆలయ అవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈవో డీవీ ప్రసాద్‌రావు, అర్చకుడు బంటుపల్లి వెంకటరావులు ఈ మేరకు ప్రకటించారు. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేయాలని నిర్ణయించామన్నారు. సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 30 వరకూ దాదాపు 40 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని, సెప్టెంబరు 20న పైడిమాంబ మండల దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబరు 10న అర్ధమండల దీక్ష ప్రారంభించనున్నామని వివరించారు. అక్టోబరు 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమానోత్సవం జరుగుతుందన్నారు. అదే నెల 27న కలశ జ్యోతి ఊరేగింపు ఉంటుందని చెప్పారు. అక్టోబరు 29న ఉయ్యాల కంబాల ఉత్సవం, 30న చండీహోమంతో ఉత్సవాలు ముగియనున్నా యన్నారు. ఉత్సవాల విజయవంతానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పైడిమాంబ భక్తులు, జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు. పైడిమాంబ సిరిమానోత్సవాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వివిధ సామాజిక మాధ్యమాలు, అదే విధంగా వెబ్‌సైట్‌లో అందుబాటులో వుంచుతామన్నారు. సమావేశంలో ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు..

పైడిమాంబ చదురుగుడి, వనంగుడిలో శ్రావణమాసం మూడో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు చేపట్టారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

విజయనగరం టు ఢిల్లీ

- గంజాయి తరలింపునకు వ్యూహం
- ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు
- 22 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 20: విజయనగరం శివార్లలోని ధర్మపురిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న ముఠా అక్కడి నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు గంజాయిని గుట్టుగా తరలిస్తున్నారు. ఏజెన్సీ నుంచి చాకచక్యంగా తీసుకువచ్చి ఇక్కడ ప్యాకింగ్ చేసి ఒడిశా, ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. కొన్నాళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం గుట్టును పోలీసులు తాజాగా రట్టు చేశారు. ఢిల్లీకి చేర వేయాలనుకున్న 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు. ఆ వివరాలను ఎస్పీ వకుల్‌జిందాల్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ వసీం తెలంగాణ రాష్ట్రంలోని రాజేంద్రనగర్ నుంచి ఏడాదిన్నర క్రితం విజయనగరం వచ్చి ధర్మపురిరోడ్డులో ఉన్న వసంతవిహార్ విల్లాలో దిగాడు. ఒక ఇంటిని అద్దెకు తీసుకుని గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఢిల్లీకి చెందిన మహ్మద్ కబీర్ సూచనతో మహ్మద్ వసీం గంజాయిని తరలిస్తుంటాడు. ఒడిశా నుంచి ఆంధ్రాకు ఇక్కడి నుంచి ఢిల్లీకి పథకం ప్రకారం తరలిస్తున్నాడు. ఎక్కువ మొత్తంలో విజయనగరం తీసుకువచ్చి చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి ఢిల్లీ పంపుతుంటాడు. కాగా తాజాగా కొంత గంజాయిని అరకు ప్రాంతానికి చెందిన మజ్జి విశ్వనాథం, అతని భార్య మజ్జి గంగమ్మలు విజయ నగరంలో వున్న మహ్మద్ వసీంకు విక్రయించారు. ఆ గంజాయిని అరకు నుంచి విజయనగరం రవాణా చేసేందుకు గొల్లూరు అనిల్, గోవింద, గోపీ, అర్జున్ అనే నలుగురు వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నలుగురు విజయనగరంలో వుంటున్న మహ్మద్ వసీంకు గంజాయి సరఫరా చేశారు. వసీం వద్ద నుంచి గంజాయి తరలించేందుకు ఢిల్లీకి చెందిన కబీర్ వేరే వ్యక్తులను ఏర్పాటు చేశాడు. బీహార్ రాష్ట్రం కిసాన్‌గంజ్ జిల్లా ఆల్తవాడ గ్రామానికి చెందిన ఇంపోజ్ ఆలాం, ఢిల్లీ జామినగర్‌కు చెందిన రుక్సాయ్ ఖుర్షీద్‌లు కలిసి గంజాయిని తీసుకువెళ్లేందుకు ఇటీవల విజయనగరం వచ్చారు. గంజాయి రవాణాకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయం పోలీసులకు తెలిసింది. ప్రణాళికతో దాడులు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ వసీం, ఇంపోజ్ ఆలం, రుక్సాయ్ ఖుర్షీద్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 22.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంజాయి సరఫరా చేసిన మజ్జి విశ్వనాథం, అతని భార్య మజ్జి గంగమ్మతో పాటు విజయనగరానికి గంజాయిని రవాణా చేసిన గొల్లూరు అనిల్, గోవింద్, గోపి, అర్జున్‌లను త్వరలో అరెస్టు చేస్తామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ గోవిందరావు, భోగాపురం సీఐ రామకృష్ణ, సీఐ విజయనాథ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రాజాం నియోజకవర్గానికి 26 ట్రాక్టర్లను అందించారు. వాటిని కస్టమ్ హైరింగ్ కేంద్రాలకు అప్పగించారు. అవేవీ ఇప్పుడు కనిపించడం లేదు. ప్రస్తుతం చురుగ్గా సాగుతున్న ఉబాలు పనుల్లో ఎక్కడా కంట పడలేదు. మరి యంత్రాలు ఏమైనట్లు అంటే ఆ పార్టీ నేతల ఇళ్లలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఒక్క రాజాం నియోజకవర్గంలోనే కాదు. అన్నిచోట్లా ఉంది. జిల్లాలో యంత్రా సేవా పథకం పడకేసింది.

అవి ఏమయ్యాయి?

- కనిపించని సాగు యంత్రాలు, పరికరాలు
- అభాసుపాలైన కస్టమ్ హైరింగ్ కేంద్రాలు
- పేర్లు రైతులవి.. ట్రాక్టర్లు వైసీపీ నేతలవి
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

రాజాం, ఆగస్టు 20: వైసీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానంగా కస్టమ్ హైరింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. వాటిలో ట్రాక్టర్లతో పాటు వరి, మొక్కజొన్న నూర్పిడి యంత్రాలు, రోటోవేటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, ట్రాక్టర్ ఆధారిత ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రకటించింది. వైఎస్సార్ యంత్రసేవ పథకంలో భాగంగా రైతులను గ్రూపులుగా విభజించి ఉమ్మడిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది. అయితే ఆ గ్రూపులో అధికార వైసీపీ సానుభూతిపరులే ఎక్కువ. ఎక్కడా ఇతరులకు చోటు లేకుండా పోయింది. వీరినే కస్టమ్ హైరింగ్ కేంద్రాల సభ్యులుగా కూడా ఎంపిక చేశారు. వీరు పది శాతం సొమ్ము కడితే 40 శాతం ప్రభుత్వం రాయితీ వర్తించింది. మిగతా 50 శాతం బ్యాంకు రుణం. కాగా అసలు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఉన్నాయన్న విషయమే చాలామందికి తెలియని పరిస్థితి. వాస్తవానికి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలించి నిజమైన రైతులను గుర్తించాలి. కానీ అలా జరగలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సు మేరకు కొంతమంది రైతులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వారి పేరుతో కస్టమ్ హైరింగ్ సెంటర్లను నడిపారు. వారే వాహనాలతో పాటు యంత్రాలనూ దక్కించుకున్నారు.

ఆ ట్రాక్టర్లు ఏమయ్యాయి?

జిల్లాకు రెండు విడతల్లో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద 335 ట్రాక్టర్లను అందించినట్టు చెబుతున్నారు కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదు. వైసీపీ నేతలే సమీప బంధువులను, అనుచరులను బినామీలుగా ఏర్పాటుచేసుకొని కైవసం చేసుకున్నారు. జిల్లాలో ఎక్కువగా ఎస్.కోట నియోజకవర్గానికి ట్రాక్టర్లు అందించారు. మొత్తం 70 ట్రాక్టర్లు అందించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. బొబ్బిలి నియోజకవర్గానికి 59, గజపతినగరం నియోజకవర్గానికి 60, చీపురుపల్లికి 37, రాజాంకు 66, విజయనగరంకు 13, నెల్లిమర్లకు 40 ట్రాక్టర్లు అందించినట్టు చెబుతున్నారు.

ఇతర పరికరాలదీ అదే తీరు

పరికరాలదీ అదే తీరు. తొలి విడతలో 326 గ్రూపులకు, రెండో విడతలో 184 గ్రూపులకు సాగు పరికరాలు అందించారు. మొదటి విడతలో అందించిన పరికరాల విలువ రూ.28.45 కోట్లు.. ఇందుకుగాను ప్రభుత్వం అందించిన రాయితీ రూ.9.34 కోట్లు, రెండో విడత పరికరాల విలువ రూ.15.10 కోట్లు.. రాయితీ రూ.4 కోట్లపైమాటే. ఇంత ఖర్చుపెట్టి అందించిన ట్రాక్టర్లు, పరికరాలు నిజమైన రైతులకు అద్దెకు దొరకడం లేదు. దీంతో ఎప్పటిలా అధిక అద్దెలు చెల్లించి రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. సాగులో కూలీల కొరత అధిగమించేందుకు, పెట్టుబడులు తగ్గించుకునేందుకు వీలుగా ప్రవేశపెట్టిన యంత్ర సేవా పథకం వైసీపీ నాయకులకే ఉపయోగపడింది. దీనిపై ప్రభుత్వం విచారణ చేపడితే ఎన్నో నిజాలు వెలుగుచూసే అవకాశం ఉంది.



పీఏసీఎస్‌లు బలోపేతం కావాలి

- రైతులందరినీ సభ్యులుగా చేర్చండి: కలెక్టర్

కలెక్టరేట్, ఆగస్టు 20: జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడానికి వచ్చే మూడు నెలల్లో చొరవ తీసుకోవాలని కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 65 సహకార సంఘాల్లో కేవలం 9 మాత్రమే లాభాల్లో ఉన్నాయని, మిగిలిన వాటిని కూడా లాభాల బాటలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ముందుగా సంఘాలను మూడు నెలల్లో క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. నష్టాల్లో ఎందుకు ఉన్నాయో అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 65 సంఘాల్లో సుమారు 2,60,000 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, రైతులందరినీ సభ్యులుగా చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకో 30 వేల మంది రైతులనైనా సభ్యులుగా చేర్పించాలన్నారు. పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణను వేగంగా పూర్తి చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

సమావేశంలో జేసీ సేతు మాధవన్, జిల్లా సహకార అధికారి రమేష్, సీపీవో బాలాజీ, వ్యవసాయ శాఖ జేడీ రామారావు , డీపీవో శ్రీధర్‌రాజ , మత్స్య డీడీ నిర్మలాకుమారి తదితరులు ఉన్నారు.

సువర్ణముఖిలో పూడిక తొలగించాలి

సువర్ణముఖి నదిలో వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద పూడిక తొలగించేం దుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. పనులు వారం రోజుల్లో ప్రారంభం కావాలన్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. వరద నివారణకు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, భూగర్భ జలాలను వృద్ధి చేసేందుకు, సువర్ణముఖి నదిలో కొండచాకరాపల్లి వద్ద పేరుకు పోయిన ఇసుకను తొలిగించాలని సూచించారు.

ప్రణాళికలు వాస్తవంగా ఉండాలి

- జేసీ సేతు మాధవన్

కలెక్టరేట్, ఆగస్టు 20: వ్యవసాయ శాఖ ఐదేళ్ల ప్రణాళికను పక్కాగా రూపొందించాలని జేసీ సేతు మాధవన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ ఆంధ్ర 2047లో భాగంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించేటప్పుడు సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకోవాలని, జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. సాగు భూమి విస్తీర్ణం, పంటల దిగుబడిని పెంచాలని కోరారు. సమావేశంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్, జిల్లా స్థాయి పంట కోత ప్రయోగాలకు చెందిన యాప్‌లు, పంట నష్టం అంచనా, పంటల బీమా, సమాచార హక్కు చట్టం తదితర వాటి గురించి వ్యవసాయ అధికారులకు వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, సీపీవో బాలాజీ, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని , ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BYXem1hలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

Alstom India

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.
- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Legrand Empowering

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.
- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant

SCHOLARSHIP ALERT

from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

****Special category:*** Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.
- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

****Special category:*** Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు



ప్రఖ్యాత నేపథ్య గాయకురాలు కె.ఎస్.చిత్ర, సంగీత దర్శకుడు ఉత్తమ్ సింగ్‌లను దివంగత గాయని లతా మంగేష్కర్ స్మారక పురస్కారాలు వరించాయి. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబరు 28న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంగళవారం ప్రకటించింది. ప్రతీ ఏటా లతా మంగేష్కర్ జయంతి రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 2022 సంవత్సరానికి ఉత్తమ్ సింగ్, 2023 సంవత్సరానికి చిత్ర ఈ అవార్డులు అందుకోనున్నారు. లత స్మారకార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన నూతన ఆడిటోరియంలో ఈ అవార్డులను బహూకరిస్తారు.

అందరికీ ధన్యవాదాలు



తన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా ఈ నెల 17న నగరంలోని ఒక కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె... సోమవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆమె భావోద్వేగంతో అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'తమిళ అభిమానులకు నాపై ప్రత్యేక ప్రేమ ఉంది. వారికి పాటలంటే ప్రాణం. అందుకే భగవంతుడు నన్ను పంపాడు. దేవుడు నాకు ఇంత మంచి గొంతు ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైంది' అని ఆమె పేర్కొన్నారు.

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

సర్దుకుపోవడం.. రాజీపడటం...

మలయాళ పరిశ్రమలో ఈ రెండూ చాలా ఫేమస్ ● మల్లూవుడ్‌లో మహిళల సమస్యలపై హేమ కమిటీ రిపోర్ట్
● పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలని కండిషన్ ● అంగీకరిస్తే కోడ్‌నేమ్, ఎదురు తిరిగితే అప్రకటిత నిషేధం



2017లో నటి భావన కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ ఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే హేమ ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటకు రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి.

మలయాళ చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మల్లూవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడీ, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాలు విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాల్లో కొన్ని

- షూటింగ్ సమయంలో మహిళలకు మరుగుదొడ్డి సదుపాయాల కొరత ఉంది. ఈ-టాయ్‌లెట్‌లు సరిపడా స్థాయిలో ఉండడం లేదు. అలాగే దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు భయపడాల్సి వస్తోంది.
- ప్రొడక్షన్ మేనేజర్లు అవకాశాల కోసం తమను కలిసే మహిళలను లొంగదీసుకుంటున్నారు. 'పరిస్థితులను బట్టి సర్దుకుపోండి, కొన్ని విషయాల్లో రాజీపడండి అలాగైతేనే మీకు మా సినిమాలో అవకాశం ఇస్తాం' అని కండీషన్ పెడుతున్నారు. 'పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలి' అని షరతుడు పెడుతున్నారు. సర్దుకుపోవడం, రాజీపడడం.. అనే ఈ రెండు మలయాళ చిత్రసీమలో చాలా ఫేమస్ అని కమిటీ నివేదికలో పేర్కొంది.
- షూటింగ్‌లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్స్‌లో ఉన్న మగవాళ్లు ఎక్కువ సార్లు మత్తులో జోగుతూ తమ తలుపు తట్టారని కమిటీ ముందు చెప్పారు. వారించినా పదే పదే తలుపులు కొడుతున్నారనీ, వాళ్లు తలుపులు బద్దలు కొట్టుకొని లోపలకి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు తెలిపారు. చిత్రీకరణకు ముందే ఓ హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించాడు. ఆ ప్రభావం ఆమె నటనపై పడింది. అతనిపైన ఉన్న ద్వేషమే ఆమె ముఖంలో ప్రతిఫలించింది. దీనివల్ల ఒక్కషాట్‌కు ఆమె 17 టేక్‌లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో డైరెక్టర్ ఆమెను తిట్టాడు.

ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలి

రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ట్రిబ్యూనల్ పనిచేయాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మహిళా న్యాయమూర్తులను నియమించాలి. మహిళలకు సురక్షితమైన వసతి, రవాణా, టాయిలెట్‌లు, ఉండే దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. షూటింగ్‌లో డ్రగ్స్, మద్యంపై నిషేధం విధించాలి. జూనియర్ ఆర్టిస్టులకు వర్క్ కాంట్రాక్ట్‌లను అమలు చేయాలి. మహిళలకు వారి ప్రతిభ, శ్రమకు తగ్గ పారితోషికం అందేలా చూడాలి. సమాన అవకాశాలతో పాటు అందరినీ కలుపుకోని పోయే వాతావరణాన్ని పరిశ్రమలో సృష్టించాలని నివేదిక సూచించింది.

స్టార్‌డమ్‌తో ఇబ్బందులు

లైంగికవేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటీ స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మహిళలు చెబుతున్నారు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పలుకుబడి పనిచేస్తోంది

- కొందరు పలుకుబడి ఉన్న నిర్మాతలు, దర్శకులు, నటీనటులు ప్రొడక్షన్ కంట్రోలర్స్ లాంటి పవర్‌ఫుల్ వ్యక్తులు పరిశ్రమను నియంత్రిస్తున్నారని నివేదిక పేర్కొంది. తమ పలుకుబడిని ఉపయోగించి పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తారని మహిళలు భయపడుతున్నారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేస్తే, వారిపైన అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. తర్వాత మరో సినిమాలో అవకాశం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల తమ కెరీర్ బుగ్గి అవుతుందని మహిళలు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు.
- అగ్రతారలకు మినహా ఇతర నటీనటులకు పారితోషికానికి సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు, జూనియర్ యాక్టర్స్‌కు పూర్తి పారితోషికం అందడం లేదు. డిమాండ్ చేసే వీలు కూడా ఉండడం లేదు.

చిక్కుల్లో 'జైలర్' దర్శకుడి సతీమణి

ఇటీవల జరిగిన బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో 'జైలర్' చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ సతీమణి మోనీషాను నగర పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా, ఓ నిందితుడు పోలీస్ ఎన్‌కౌంటరులో ప్రాణాలు కోల్పోయాడు. ఇందులోభాగంగా, పేరుమోసిన రౌడీ మొట్టై రాజేంద్రన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొట్టై రాజేంద్రన్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఆయన పారిపోయేముందు మోనీషాతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించడంతో ఆమె చిక్కుల్లో పడ్డారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



శ్రద్ధాకు రూ. 5 కోట్లు.. తమన్నాకు రూ. కోటి!

శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు నటించిన 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. పోటీలో రెండు చిత్రాలు ఉండడంతో వాటికంటే ఒక రోజు ముందు విడుదల చేస్తే హిట్ గ్యారంటీ అనుకున్న నిర్మాతల అంచనాలు వమ్ము కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటిన 'స్త్రీ 2' చిత్రం విడుదలయ్యాక వసూళ్లలోనూ ముందంజలో ఉంది. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం తొలి ఐదు రోజుల్లోనే దాదాపు రూ.322 కోట్ల గ్రాస్‌ను సాధించింది. సూపర్ న్యాచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2' విడుదలైన మర్నాడు వచ్చిన 'వేద', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ధాటిని తట్టుకోలేక కలెక్షన్లలో తేలిపోయాయి. కాగా, 2018లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. రెండు భాగాలకూ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించగా, మ్యాడోక్ ఫిల్మ్, జియో సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

అయిదు నిమిషాలకు కోటి

నటి తమన్నా 'సరిలేరు నీకెవ్వరు', 'జైలర్', 'జై లవ కుశ' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో తళుక్కుమన్న సంగతి తెలిసిందే. ఆమె తాజాగా, 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' అనే ఐటెం సాంగ్‌లో నటించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రాజ్‌కుమార్ రావుకు రూ. ఆరు కోట్లు, హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు రూ. ఐదు కోట్లు పారితోషికంగా ఇచ్చారు. అయితే ఐటెం సాంగ్‌లో అయిదు నిముషాలు అలా మెరిసిన తమన్నా ఆ పాట కోసం ఏకంగా రూ. కోటి రూపాయలు వసూలు చేశారట. ఆమె నర్తించిన ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'స్త్రీ' మొదటి భాగంలో నోరా ఫతేహి ప్రత్యేక గీతం కోసం రూ.25 లక్షలు తీసుకోగా.. రెండో భాగానికి తమన్నా నాలుగు రెట్లు అధికంగా తీసుకోవడం విశేషం. తమన్నా డిమాండ్ అలా ఉంది మరి!



పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్ అమ్మకానికి!

నటి సోనాక్షి సిన్హా ఇటీవలే పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆమె తను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను అమ్మకానికి పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గత ఏడాది సెప్టెంబరులో ముంబైలోని బాంద్రాలో రూ.11 కోట్లు పెట్టి ఆమె ఓ ఇంటిని కొన్నారు. అదే అపార్ట్‌మెంట్లో ఇటీవలే ఆమె జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌ను ఆమె రూ.25 కోట్లకు అమ్మకానికి పెట్టారు. ఏడాది కూడా కాకుండానే.. అదీ వారిద్దరి పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్‌ను ఇలా సడెన్‌గా అమ్మకానికి పెట్టడం అందరిలో కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అసలు ఈ అపార్ట్‌మెంట్ అమ్మడానికి అసలు కారణం ఏంటా అని అభిమానులు నెట్టింట చర్చిస్తున్నారు.

అసూయతో వచ్చిన మాటలవి






ప్రభాస్‌పై బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలను హీరో సుధీర్‌బాబు, దర్శకుడు అజయ్ భూపతి తప్పుపట్టారు. మంగళవారం సోషల్‌మీడియాలో ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. "అర్షద్ వార్సీ నుంచి ఇలాంటి ప్రొఫెషనలిజం లేని మాటలు రావడం అస్సలు ఊహించలేదు. విమర్శనాత్మకంగా మాట్లాడవచ్చు కానీ ఇలా చులకనగా మాట్లాడ్డం సరికాదు. ఇలాంటి అనవసర వ్యాఖ్యలను పట్టించుకునే తీరిక ప్రభాస్‌కు లేదు. ఆయన స్థాయి చాలా పెద్దది" అని ఎక్స్‌లో సుధీర్‌బాబు పేర్కొన్నారు. "భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడానికి.. తన వంతుగా ఏమైనా చెయ్యడానికి ప్రభాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన మన దేశానికే గర్వకారణం. ఈ మాటలన్నీ వార్సీ నుంచి అసూయతో వచ్చినవే" అని దర్శకుడు అజయ్ భూపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే అర్షద్ వార్సీ, 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

కొత్తగా..

విడుదల తేదీ మారింది



వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగులో కూడా తనకంటూ అభిమానుల్ని ఏర్పరచుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం కోసం 1980ల నాటి ముంబై నగరాన్ని పునర్నిర్మించడం విశేషం. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ సినిమాను మొదట సెప్టెంబర్ ఏడున విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. ఈ మార్పు గురించి చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నా నిర్మాణానంతర కార్యక్రమాలకు అదనపు సమయం పడుతోంది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఎక్కడా రాజీ పడడం లేదు. అందుకే విడుదల తేదీ మారింది' అని చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా 'లక్కీ భాస్కర్' విడుదల కానుంది.

దసరాకి వస్తున్న రాజావారు



'మ్యాడ్', 'ఆయ్' వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ హిట్‌తో దూసుకుపోతున్న నార్నే నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సతీశ్ వేగేశ్న దర్శకుడు. చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు నచ్చి, ఎంపిక చేసిన కథతో మా సినిమా రూపుదిద్దుకుంది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు సతీశ్ ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించారు. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ ఫార్మెట్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దసరాకు విడుదల చేస్తున్నాం. ఇది నార్నే నితిన్‌కు హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు.

ప్రేమోత్సవం



దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్రంలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ గీతానికి అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుంది.

నిత్యం కడగండ్లు

- రైతులకు తప్పని ఇక్కట్లు
- సాగునీరందక కష్టాలు

బొబ్బిలి

వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని అప్పటి సీఎం జగన్‌తో పాటు జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు అన్ని వేదికల మీద చెబుతూ వచ్చారు. వాస్తవ పరిస్థితులు చూస్తే అందుకు భిన్నంగా కనిపిస్తాయి. అన్ని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోనూ నిధులు లేక నీరసించి పోతున్న దాఖలాలు ఉన్నాయి. తోటపల్లి ప్రాజెక్టుకు భారీగా నిధులు ఇచ్చామని ప్రభుత్వం చెప్పింది. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకమునుపే బొబ్బిలి మండలం అలజంగి సమీపంలో తోటపల్లి కాలువకు గండ్లు పడడం, పంటలు మునిగిపోవడం జరుగుతూనే ఉంది. అలజంగి వద్ద తరచూ గండ్లు పడడం సర్వసాధారణమైపోయింది. ఫలితంగా పంటలు నీటి పాలవుతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత నెలలో బాడంగి మండలం అల్లుపాల్తేరు వద్ద రెండు దఫాలు గండ్లు పడ్డాయి.



అలజంగి వద్ద తోటపల్లి కాలువకు పడిన గండి (ఫైల్)



గండి పూడ్చే పనిలో సిబ్బంది (ఫైల్)

పెరిగిన అంచనాలు..

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో 118 కిలోమీటర్ల పొడవుగల కాలువలు ఉన్నాయి. ఇందులో 27 కిలోమీటర్ల కాలువలకు సిమెంట్ లైనింగ్ వేసేందుకు నాలుగేళ్ల క్రితం రూ.88 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దీనికి ఎటువంటి పరిపాలనాపరమైన అనుమతి రాకపోవడంతో అధికారులు ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. ఇవే పనులకు అంచనా వ్యయం భారీగా పెరిగింది. పెరిగిన ధరల ప్రకారం గత ఏడాదికే రూ.110 కోట్లకు పైగా నిధులు అవసరమని అధికారులు గుర్తించారు. ఈ అంచనా ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయగలదా? అన్నది ప్రశ్నార్థకమే.

పటిష్టం చేయాలి..

మా గ్రామాల మీదుగా వెళుతున్న తోటపల్లి కాలువతో ఎటువంటి ప్రయోజనం లేదు సరికదా గండ్లు పడితే పంట పొలాలన్నీ మునిగిపోతున్నాయి. చాలా ఏళ్ల నుంచి చెబుతున్నప్పటికీ ముంపు నుంచి గ్రామానికి రక్షణ కల్పించడం లేదు. ఈ ఏడాది ఇప్పటికి రెండు సార్లు గండ్లు పడ్డాయి. కాలువల కోసం మా భూములను కోల్పోయాం. తోటపల్లి కాలువ వస్తుందంటే సంబరపడ్డాం. కానీ మాకు నీరు లేకుండా పోయింది. ముంపు మిగిలింది. చుట్టిచెరువు, దాలిందర చెరువులను మినీ జలాశయాలుగా తీర్చిదిద్దితే చుట్టుపక్కల గ్రామాలన్నిటికీ శాశ్వత ప్రయోజనం కలుగుతుంది.

-రెడ్డి జగదీశ్వరరావు, యాండ్రాపు వేణు, ముసిడిపల్లి శ్రీరాములు, రైతులు

ఉపాధి పనుల ఆమోదం కోసం గ్రామసభలు

కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 20: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు ఈనెల 23న అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న నిర్వహించే గ్రామసభల్లో ఉపాధి హామీ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకునేలా గ్రామీణ పేదలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెండు రోజుల ముందే గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సుమారు 48 రకాల పనులను ఈ పథకం కింద నిర్వహించే అవకాశం ఉందన్నారు. డీపీవో శ్రీధర్ రాజా మాట్లాడుతూ ప్రతి మండలంలో మాక్ గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. ● జిల్లాలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతి గృహాలు, ఆశ్రమాల్లో పరిస్థితులపై తనిఖీ చేసి తనకు రెండు రోజుల్లో నివేదికలు అందజేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న పిల్లల హాస్టళ్లు, ఆశ్రమాలు ఈ మేరకే జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళా శిశు సంక్షేమాధికారులు, వికలాంగులు సంక్షేమశాఖ అధికారికి ఆయా వసతి గృహాలు, సంరక్షణ కేంద్రాలు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

విజయనగరం క్రైం: ఇటీవల మరణించిన హోంగార్డుల కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఇద్దరు మహిళలు జి.పార్వతి, ఎం.రజనీలను హోంగార్డులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సహచరులు సమకూర్చిన ఒక్కరోజు అలవెన్సు రూ.23,430ను హోంగార్డు వెంకట సత్యం సతీమణి జి.పార్వతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐ రమేష్ కుమార్, డీపీఓ పర్యవేక్షకులు ప్రభాకరరావు, ఆర్ఎస్ఐ షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను అందజేసిన ఎస్పీ జిందాల్

జూడో పోటీలకు బాలికలు ఎంపిక

కొత్తవలస: చెన్నైలో సెప్టెంబర్ 10, 11, 12, 13 తేదీలలో నిర్వహించే ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించి మంగళవారం కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో బాలికలను ఎంపిక చేసినట్టు రాష్ట్ర జూడో ఇన్‌చార్జ్ పాండు రంగ రుక్మాంగధరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎం.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ ప్రవేశాలు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 22 నుంచి 24లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ కేశవ రావు తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. బీఏ పొలిటికల్ సైన్స్ ఎకనామిక్స్, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మేథమేటిక్స్ కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలో బాడంగి విద్యార్థిని ప్రతిభ

బాడంగి: శ్రీకాకుళంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగిన జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాడంగి జెడ్పీ పాఠశాల విద్యార్థిని మరడాన ప్రసన్న జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి స్టేట్ ప్రథమ స్థానం పొందడంలో కీలక పాత్ర పోషించింది. వీరికి కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజ రాపు రామ్మోహన్నాయుడు చేతులమీదుగా ట్రోఫీ, గోల్డ్ మెడల్ అందుకుంది. ప్రసన్నను, శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ గొర్లె బంగారునాయుడు, హెచ్‌ఎం సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు, అధికారులు, నాయకులు అభినందించారు.

23న జిల్లావ్యాప్తంగా గ్రామసభలు

మెంటాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనున్నారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 23న జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో త్రివి క్రమరావు మండల శాఖాధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ముందుగా దండోరా వేయాలని, ప్రజలకు అవగాహన కల్పించిన తర్వాత గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించారు.

లక్కవరపుకోట: మండలంలో ఈ నెల 23 శుక్రవారం జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని ఏపీవో విజయలక్ష్మి కోరారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బొబ్బిలి రూరల్ : మండలంలో గల అన్ని గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ఈ నెల 23వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల వివరాల జాబితా విడుదల చేశారు. ఆయా గ్రామ సభల్లో సర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో పాటు ఉపాధి కూలీలు, గ్రామాల్లో పనిచేస్తున్న ఆయా శాఖల సిబ్బంది పాల్గొనాలన్నారు.

రామభద్రపురం: రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలకు లక్ష్యం నిర్దేశించుకోవాలని జాతీయ ఉపాధిహామీ పథకం ఏపీవో గొలగాని త్రినాథరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న జరగనున్న గ్రామసభల్లో ఈ పనులపై లక్ష్యాలు సాధించుకోవాలన్నారు. గతంలో వలె కాకుండా ప్రస్తుతం చెరువు పనులు కాకుండా గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, హార్టికల్చర్ తదితర పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఈసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

బురదనీటిలో బైఠాయించి.. నిరసన

- రహదారుల దుస్థితిపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణం ఫూల్‌బాగ్ రోడ్డులోని బురదనీటి గుంటలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు మంగళవారం బైఠాయించి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఫూల్‌బాగ్ రోడ్డులో విద్వాన్, సత్యసాయి, గాయత్రి, సాయిరాం, తాండ్రపాపారాయ, రాజా కళాశాల, సంస్థానం హైస్కూలు తదితర విద్యా సంస్థలు ఉన్నాయి. ఈ రోడ్డు అధ్వానంగా తయారవడంతో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, భారీ వాహనాలు నిలిచిపోతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణికుమార్‌లు ఆరోపించారు. తెర్లాం, బలిజిపేట, అలజంగి, కారాడ, పిరిడి, బాడంగి ప్రాంతాల నుంచి రోజూ వచ్చే వేలాది మంది విద్యార్థులు, ప్రయాణికులు నరకం చవిచూస్తున్నారని అన్నారు. ఆందోళన చేస్తున్న వారి దగ్గరకు మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణా రావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, ఇతర అధికారులు వచ్చి వారంలోగా రోడ్డు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.



బురదనీటి గుంతలో కూర్చొని ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

ఎమ్మెల్యే సొంత నిధులతో గుంతలకు మోక్షం



గుంతలను పూడ్చుతున్న దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో రోడ్లు మెరుగుపరిచేందుకు ఎమ్మెల్యే బేబీనాయన ముందుకు వచ్చారు. స్థానిక ఫూల్‌బాగ్ రోడ్డులో బురదనీటి గంతలో ఆటో బోల్తాపడిన ప్రమాదంలో పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. ఫూల్‌బాగ్ రోడ్డులో గుంతలన్నిటినీ తన సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ఆ నిధులు వచ్చేలోగా తాత్కాలికంగా తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఎమ్మెల్యే చొరవపై టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సుంకరి సాయి రమేష్, సోంబాబు, కాగాన సునీల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బస్సు పాసు కౌంటర్ ఏర్పాటుకు చర్యలు

కొత్తవలస: కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు పాసు కౌంటర్ ఏర్పాటు చేసే విషయం పరిశీలనలో ఉందని విజయనగరం ఆర్టీసీ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నైట్ హాల్ట్ బస్సులకు సంబంధించి డ్రైవర్లు, కండక్టర్ల విశ్రాంతి గదులలో పడుకునేందుకు సిబ్బందికి ఏర్పాటు చేసిన పరుపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవలస చుట్టు పక్కల నుంచి చాలా మంది విద్యార్థులు విశాఖపట్టణం వంటి ప్రాంతాలకు చదువుకునేందుకు వెళుతున్నందున ఇక్కడ బస్సు పాసు కౌంటర్ ఏర్పాటు చేయాలని వినతులు వస్తున్నాయన్నారు. విజయనగరం నుంచి కొత్తవలస, కె.కోటపాడు మీదుగా చోడవరానికి బస్సులను నడపాలని కొంతమంది కోరారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట, సింహాచలం డిపో మేనేజర్లు రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈడీ రవికుమార్

బొబ్బిలిలో ఆర్జేడీ పర్యటన

బొబ్బిలి రూరల్: బొబ్బిలి పురపాలక సంఘంలో మంగళవారం ఆర్‌జేడీ నాగరాజు పర్యటించారు. ఇందిరమ్మ కాలనీలో కాలువల్లో పూడిక తొలగింపు పనులు, మైహోమ్ అపార్ట్‌మెంట్లో ఆన్ సైట్ కంపోస్టింగ్‌లను పరిశీలించి గృహ యజమానులకు సూచనలు చేశారు. రామన్నదొరవలసలో ఉన్న కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రం, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై చిన్నచూపు వద్దు

బొబ్బిలి రూరల్: ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడొద్దని మెట్టవలస సర్పంచ్ పువ్వుల మాధవరావు అన్నారు. గ్రామంలో మంగళవారం నాకో ఆర్గనైజర్ చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డబ్ల్యూఎస్ విజయ, సూపర్‌వైజర్ రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

శృంగవరపుకోట: నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. శ్రీకాకుళం పట్టణంలో మంగళవారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పలరామ ప్రసాద్‌తో కలసి మర్యాద పూర్వకంగా మంత్రిని కలిశారు. వారి వెంట ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, ఎల్.కోట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, నాయకులు మళ్ల రామకృష్ణ, రాయవరపు రవి శంకర్, కొటాన విజయ్, అల్లు కిట్టు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

గ్రామాల భద్రతపై దృష్టి పెట్టండి

వేపాడ: సచివాలయ మహిళా పోలీసులు గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్.కోట రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. మంగళవారం వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన మండలంలోని మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరచరిత్ర కలిగిన, అపరచిత వ్యక్తుల సంచారం, బెల్ట్ షాపుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ పోలీసులతో సమావేశమైన సీఐ

ఘనంగా మరిడి మహాలక్ష్మి పండుగ

జామి: మండల కేంద్రమైన జామి గొర్లె వీధిలో కొలువైన మరిడిమహాలక్ష్మి పండుగను స్థానికులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు పసుపుకుంకుమలు సమర్పించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు.



సీబీఎం హైస్కూలు మూసివేతకు రంగం సిద్ధం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ నడిబొడ్డున గల చరిత్రాత్మకమైన సీబీఎం బాలికల ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మూసివేతకు రంగం సిద్ధమైపోయింది. మంగళవారం సాయంత్రం డిప్యూటీ డీఈఓ మోహనరావు, ఎంఈఓలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసులు స్థానిక సీబీఎం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ పాఠశాలకు రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కాలేదని, ఇక్కడి విద్యార్థులను వేరే పాఠశాలలకు తరలించి దీనిని మూసివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై సీబీసీఎస్ సీ అధ్యక్షుడు కె.అదృష్ట కుమార్ తదితరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు డిప్యూటీ డీఈఓతో వాదనకు దిగారు. పేద బాలికల హైస్కూల్‌ను రక్షించాలని తామంతా డిమాండ్ చేస్తున్న తరుణంలో అధికారికంగా మూసివేయాలని హుకుం జారీ చేయడం అన్యాయమన్నారు. పాఠశాలను మూసివేయడమో, తరలించడమో చేస్తే సహించేది లేదన్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని డిప్యూటీ డీఈఓకు వారు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం సునేత్రి, ఎంఈవోలు, ఎస్ఎఫ్ఐ నాయకులు, మతపెద్దలు వేణు, వి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డీఈవోతో ఎస్ఎఫ్ఐ నాయకులు, తల్లిదండ్రుల వాగ్వాదం

పేకాట శిబిరంపై దాడి

- 1.23 లక్షల నగదు, 24 మొబైల్స్, 15 బైకులు సీజ్

విజయనగరం క్రైం: మెరకముడిదాం మండలం బుదరాయవలస పోలీసు స్టేషన్ పరిధిలోని పెదపూతికపేట గ్రామ శివార్లలోని మామిడి తోటలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం దాడి చేసి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్సు సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ సాగర్‌బాబు, రామారావు, సిబ్బంది దాడి చేశారు. పేకాడుతున్న వారి నుంచి రూ.లక్ష 23 వేల 860 నగదు, 24 సెల్‌ఫోన్లు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం బుదరాయవలస పోలీసులకు అప్పగించారు. జిల్లాలో ఎవరు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గరివిడి: బంగారం చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు ఎస్ఐ దామోదరరావు తెలిపారు. మంగళవారం రాత్రి విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న దేవాడ గ్రామానికి చెందిన ఏజుతుల అనూష అనే మహిళ ఇంటిలో చోరీ జరిగి 9 తులాల బంగారం పోయిందని, దీనిపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో దేవాడ గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్‌ను నిందితుడిగా గుర్తించి పట్టుకున్నామని, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

రాజాం రూరల్: పట్టణంలోని మల్లిఖార్జున కాలనీకి చెందిన పడాల శేఖర్‌పై ఈనెల 18న దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన నాగళ్ల గణేష్‌ను మంగళవారం రాజాంలో అదుపులోకి తీసుకున్నట్లు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో గణేష్‌ను హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

పారిశ్రామిక రంగంగా గుర్తించాలి

పార్వతీపురం రూరల్: పర్యాటక, ఆతిథ్య రంగాన్ని పారి శ్రామిక రంగంగా గుర్తించాలని పారిశ్రామిక రంగ ప్రతి నిధులు కోరారు. మంగళవారం పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో పారిశ్రామిక ఎగుమతులు ప్రోత్సాహకమండలి సమావేశం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతన పారిశ్రామిక విధానం కింద తయారీ, సేవా రంగాలకు పెట్టుబడి రాయితీ, స్టాంప్‌డ్యూటీ, విద్యుత్ రాయితీ, భూమార్పిడి, జీఎస్టీ, వడ్డీ రాయితీ తదితర అంశాల్లో వివిధ రేట్లలో ప్రభుత్వ రాయితీ కల్పించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు వివిధ విభాగాల్లో 45 నుంచి వంద శాతం వరకు రాయితీ ఉందని చెప్పారు. పారిశ్రామికరంగ ప్రతినిధులు పీవీఎస్ రామ్మోహన్‌రావు తదితరులు మాట్లాడుతూ సింగిల్‌విండో విధానంలో అన్ని అనుమతులు క్లియర్‌కావాలని కోరారు. రామ్మోహన్‌రావు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయుల కుటుంబాలకు బాసట

సాలూరు: సరాయివలస కొండవాగు గెడ్డలో ఇటీవల కొట్టుకొనిపోయి మృతి చెందిన ఉపాధ్యాయులు ఆర్తీ, మహేష్ కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. ఆయా కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కేంద్రప్రభుత్వం నుంచి రూ.పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.ఐదు లక్షలు ఆర్థిక సహాయం కూటమి ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు.

పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధం

సీతంపేట: పోటీ పరీక్షలకు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమారరాజా తెలిపారు. మంగళవారం సీతంపేట శాఖా గ్రంథాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ రికార్డులు నిర్వహణ సక్రమంగా ఉండాలని, పాఠకులు గ్రంథాలయానికి వచ్చేలా అవగాహన కల్పించాలని కోరారు. గ్రూప్-1, 2, బ్యాంకు తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు అవసరమైన కాంపిటేటివ్ పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి వీవీ శంకర్, స్థానిక గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులతో చేయించాలి

సాలూరు: రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని జిల్లా వ్యవసాయ సంచాలకుడు రాబర్ట్‌పాల్ కోరారు. మంగళవారం పట్టణంలో బంగారమ్మపేట సమీపంలో ఉన్న కొట్యాడ శ్రీనివాసరావు పండిస్తున్న ఆర్జీఎల్ 7034 మినీకిట్ వరి ప్రదర్శన క్షేత్రాన్ని, అన్నంరాజువలసలో ఆగ్నేయఅస్త్రం తయారీ విధానాన్ని పరిశీలించారు. తర్వాత మామిడిపల్లి రైతుసేవా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. అనంతరం సాలూరులో గల ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్, విత్తన పరీక్షలను తనిఖీచేశారు. ఆయన వెంట డివిజన్ సహాయ సంచాలకులు మధుసూదన్‌రావు, ఏవో అనురాధ, వ్యవసాయ సహాయకులు ప్రమీల, ఏపీసీఎన్ఎఫ్ కోఆర్డినేటర్ శారద పాల్గొన్నారు.

కళాశాలల్లో ప్రవేశాలు కల్పించాలి

పాలకొండ: రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి భాషా పండితుల ప్రవేశ పరీక్ష(ఎల్పీసెట్) నిర్వహించి హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు శ్రీకాకుళంలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, ఏపీ హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు సీఎల్ నాయుడు, రాష్ట్ర ప్రచార సంచాలకులు కోనె శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గైబువల్లి మాట్లాడుతూ 1935లో స్థాపించిన హిందీ ప్రచార సభ 89 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో జాతీయ హిందీ భాషా ప్రచారానికి అంకితమైందని వివరించారు. ఏపీ హిందీ ప్రచారసభ రాష్ట్ర అధ్యక్షుడు సీఎల్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మిగతా సబ్జెక్టులతో సమానంగా హిందీ పండిట్ పోస్టుల భర్తీ చేయాలని కోరారు. కాగా రాష్ట్ర మానవ వనరుల శాఖమంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

ఎంఆర్ కళాశాలలో 'ప్రేరణ'

విజయనగరం రింగురోడ్డు: మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో డిగ్రీలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ఏడు రోజుల పాటు విద్యార్థి ప్రేరణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవీజీఆర్ ఇంజనీరింగు కళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసీ శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారు భవిష్యత్తును తీర్చిదిద్దుకునే విధంగా చదువుకోవాలన్నారు. టెక్స్ బుక్స్ మెటీరియల్‌తో పాటు, ప్రయోగాత్మకంగా విద్యను అభ్యసించాలని సూచించారు. ఉద్యోగ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవలసి ఉంటుందని సూచించారు. ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశి వరావు, కన్వీనర్లు టీఎస్ఎన్ రావు, బాబ్జీ, డీపీఓ డి.చంద్రశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటిపూడి గురుకుల పాఠశాలలో ఆకలి కేకలు

- విద్యుత్తు సరఫరా లేకపోవడంతో నీటి కొరత
- మధ్యాహ్నం 3 గంటలకు భోజనాలు

శృంగవరపుకోట రూరల్: తాటిపూడి గురుకుల పాఠశాలలో మంగళవారం వందలాది మంది విద్యార్థులు ఆకలితో అలమటించారు. ఈ విషయంపై తల్లిదండ్రులు విలేకరులకు సమాచారం అందించారు. ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి కొరత ఏర్పడి వంట చేయలేదని... దీంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. దీంతో విలేకరులు పాఠశాలను పరిశీలించగా... మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విద్యార్థులు భోజనాలు చేస్తూ కనిపించారు. దీనిపై ప్రిన్సిపాల్ జామి సంధ్య మట్లాడుతూ విద్యుత్తు సమస్య కొద్దిరోజులుగా ఉందన్నారు. దీనిని పరిష్కరించేందుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు నీరు లేకపోవడం వల్ల వంట ఆలస్యమైందన్నారు. గడిచిన రెండేళ్లుగా జనరేటర్ పనిచేయడం లేదని తెలిపారు. పిల్లలకు ఈ ఒక్కరోజే భోజనాలు ఆలస్యంగా పెట్టామని తెలిపారు. సెలవు రోజుల్లో విద్యుత్తు పనులు చేయాలని ప్రిన్సిపాల్‌కు గుర్తుకు రాలేదా? పనివేళల్లో గుర్తుకు వచ్చాయా? అంటూ పలువురు తల్లిదండ్రులు మండిపడ్డారు. రెండేళ్లుగా జనరేటర్ పని చేయకపోతే మరమ్మతులు చేయించకపోవడం బాధాకరమన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.● దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ రుద్ర రవికుమార్‌ను వివరణ కోరగా తాటిపూడి గురుకుల పాఠశాల, కళాశాలలను అనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లైన్ చుట్టూ చెట్లు, కొమ్మలు అధికంగా ఉన్నాయని, వీటిని తొలగించాలని సోమవారం రాత్రి ఇద్దరు ప్రిన్సిపాల్స్ కోరారన్నారు. దీంతో మంగళవారం ఉదయం పది గంటల నుంచి ఈ లైన్ సరిచేసే పని మొదలుపెట్టామని, మేము చేసిన పనికి, నీరు రాకపోవడానికి ఎటువంటి సంబంధం లేదన్నారు.



ఆలస్యంగా భోజనాలు చేస్తున్న విద్యార్థులు

మానవ మృగాలను

ఉరి తీయాలి

● వైద్య విద్యార్థిని హత్యపై జిల్లా వ్యాప్తంగా నిరసన

పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని అత్యాచారం చేసి, హత్య చేసిన మానవ మృగాలను ఉరి తీయాలని పలువురు డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జిల్లాలోని పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



రాజాం రూరల్: జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు



బొబ్బిలి: ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశాలతో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు, మహిళలు, విద్యార్థులు



విజయనగరం రింగురోడ్డు: నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మిమ్స్ పీజీ విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

● సీహెచ్‌సీ కాంట్రాక్ట్ సిబ్బంది ఆందోళన



ఆందోళన చేపడుతున్న కాంట్రాక్ట్ సిబ్బంది

నెల్లిమర్ల: ఆసుపత్రిల్లో పని చేస్తున్న పారి శుధ్యం, భద్రత, చెదపురుగు నివారణ సిబ్బంది దశల వారీ ఉద్యమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా స్థానిక సామాజిక ఆసుపత్రిలో కూడా సిబ్బంది నిరసన చేపట్టారు. ఐదు నెలల బకాయి జీతం తక్షణమే చెల్లించాలని డిమాండ్‌చేశారు. అలాగే 2021 జూన్ నుంచి రావాల్సిన పీఎఫ్ బకాయిలు మొత్తం చెల్లించాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి, మునిసిపల్ కార్మికుల మాదిరిగా ఆప్కాస్‌లో చేర్చాలని, ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో వర్కర్ల సంఖ్య పెంచి, పని ఒత్తిడి తగ్గించాలని, జీవో నెం.549, 43ల ప్రకారం వర్కర్లకు సెక్యూరిటీగార్డులకు సూపర్‌వైజర్లకు జీతాలు పెంపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు.

బాగెమ్మపేట పోస్టుమాస్టర్ సస్పెన్షన్

వంగర: బాగెమ్మపేట పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న అనూష తరచూ విధులకు డుమ్మా కొట్టడంతోపాటు కొందరికి చెందిన ఆర్డీల సొమ్ము దుర్వినియోగం చేసినట్టు గతంలో పలువురు పోస్టల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈక్రమంలో పైఅధికారుల ఆదేశాలతో మంగళవారం స్థానిక పోస్టాఫీస్‌లో సిబ్బంది అప్పలనాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు. వాటిని పరిశీలించిన ఉన్నతాధికా రులు పోస్టుమాస్టర్‌ను సస్పెండ్ చేశారని అప్పలనాయుడు తెలిపారు. అదేవిధంగా కొంత మొత్తం సొమ్మును ఆమె నుంచి రాబెట్టామని చెప్పారు.

గుంతలు పూడ్చారు



సంకిలి వద్ద గుంతను పూడుస్తున్న దృశ్యం

రేగిడి: సంకిలి వద్ద సాయిరాం ఆలయం సమీపంలో ఉన్న ప్రమాదకర గుంతను స్థానిక టీడీపీ నాయకులు పూడ్చిపెట్టారు. అలాగే ఉంగరాడమెట్ట నుంచి సంకిలి శివాలయం వరకు అధ్వానంగా ఉన్న 3 కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. సాయిరాం ఆలయం వద్ద గుంత కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే సంకిలి శివాలయం వరకు ఉన్న అధ్వాన రోడ్డు కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై సంకిలి సర్పంచ్ బి.పట్టాభితో పాటు, టీడీపీ మండల నాయకులు మంగళవారం స్పందించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌రావు ఆదేశాలతో టీడీపీ నాయకుడు దూబ ధర్మారావు తదితరుల పర్యవేక్షణలో దాదాపు 3కిలోమీటర్ల మేర రోడ్డును కంకరతో పూడ్చి రోడ్డురోలర్‌తో గుంతలు పూడ్చేచర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్‌డీలర్లు

రాజాం/ సంతకవిటి: రాజాం సివిల్ సప్లయి గొడౌన్ వద్ద మంగళవారం సంతకవిటి మండల రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు లీలా మాధవరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. రేషన్ డీలర్ల వ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రకటన చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పౌరసరఫరాల శాఖామంత్రి మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్నేని హరిబాబు, కార్యదర్శి ప్రభాకరరావు, మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించాలి

గజపతినగరం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంల్లో వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు అన్నారు. మరుపల్లి పీహెచ్‌సీని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. రోగులకు అందించే సేవలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో ఎక్కడ మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విధుల్లో అలసత్వం వహించినవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజాం: గాంధీనగర్‌లోని సీతారామ థియేటర్ పక్కనగల మారుతి సప్లయర్స్ పైన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులతో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం ఉంటుందని సంఘం అధ్యక్షుడు నారాయణశెట్టి గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి డోల అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో హెల్త్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్ కలిగియున్న ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగులు, విశాంత ఉద్యోగులకు అన్ని రకాల కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోదరుడు జగదీష్ మంగళవారం రాజాం పట్టణంలోని పలువురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. తెలగవీధికి చెందిన పీడుగు సురేష్ మంగళవారం మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. 20వ వార్డుకు చెందిన అంపోలు రామారావు మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, ఒమ్మి సర్పంచ్ వంగా వెంకటరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, అంపోలు శ్రీను, పొట్నూరు లక్ష్మణరావు, టంకాల నాగరాజు ఉన్నారు.

ఉత్సాహంగా సైనిక్‌స్కూల్ స్పోర్ట్స్‌మీట్

విజయనగరం టౌన్: కోరుకొండ సైనిక పాఠశాలలో ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ నేషనల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ పోటీలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. మంగళవారం జరిగిన పోటీల్లో అంబికాపూర్, భువనేశ్వర్, చంబల్ పూర్ స్కూల్ విద్యార్థులతో పాటు, కోరుకొండ సైనిక స్కూల్ విద్యార్థులు పలు క్రీడాంశాల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కల్చరల్ పోటీలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సైనిక్‌స్కూల్ అధికారులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానుల పూజలు

విజయనగరం దాసన్నపేట: మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వారోత్సవాల సందర్భంగా రెండో రోజు జనసేన నాయకులు గురాన అయ్యలు నగరంలోని నూకాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన చిత్రాలలో నటించి, అభిమానులను అల రించాలని ఆకాంక్షించారు. రాజేష్, పవన్‌కుమార్, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా నిర్లక్ష్యం.. పొంచిఉన్న ప్రమాదం

● రహదారులకు ఇరువైపులా జంగిల్‌క్లియరెన్స్ చేపట్టని వైనం

● పెరిగిన పొదలతో కనిపించని సూచిక బోర్డులు

గంట్యాడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులకు ఇరువైపులా విస్తారంగా తుప్పలు పెరుగుతున్నాయి. గత ఐదేళ్ల నుంచి జంగిల్ తొలగించకపోవడంతో అవి రహదారిని మూసేస్తున్నాయి. దీంతో ఈ దారులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రధానంగా రహదారి మలుపుల వద్ద పొదలు అధికంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. జిల్లాలో చాలా చోట్ల రహదారులకు ఇటువంటి పరిస్థితి ఉంది. గతంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. రోడ్లులకు ఇరువైపులా పెరుగుతున్న జంగిల్‌ను ప్రతి వర్షాకాలంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు తొలగించాల్సి నిబంధన ఉంది. అయితే గత ఐదేళ్ల నుంచి జంగిల్ తొలగించకపోవడంతో పొదలు ఏపుగా పెరిగాయి. రహదారులను మూసే విధంగా పెరిగాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటుచేసిన సూచిక బోర్డులు కూడా కనిపించని విధంగా పొదలు పెరిగాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో.. అని వాహనదారులు భయపడుతున్నారు. మండలంలోని కొటారుబిల్లి నుంచి బుడతనాపల్లి వెళ్లే రహదారి, అలాగే కొటారుబిల్లి నుంచి సిరిపురం, లక్కిడాం, మురపాక, చంద్రంపేట, వసంత, పెదవేమలి రహదారుల్లో ఇరువైపులా పెద్దపెద్ద మొక్కలు పెరిగాయి. రహదారి కనిపించకుండా మొక్కలు పెరుగుతూ ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



కొటారుబిల్లి కూడలి నుంచి పెదవేమలికి వెళ్లే రహదారిలో జంగిల్‌క్లియరెన్స్ చేయని దృశ్యం

దోమల నిర్మూలనతో వ్యాధుల నియంత్రణ

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

విజయనగరం రింగురోడ్డు: దోమల నిర్మూలనతోనే వ్యాధులను నియంత్రించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా నివారణ అధికారి మణి, జిల్లా వ్యాధినిరోధక టీకా అధికారి ఆర్.అచ్యుతాకుమారి, డెమో వి.చినతల్లి, ఎపిడిమాలజిస్ట్ జి.వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు. ● ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాకోడు పీహెచ్‌సీలో వైద్యాధికారి శ్రావణి ఆధ్వర్యంలో రాకోడు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ● నగరంలోని బాబామెట్టలోగల కేంద్రియ విద్యాలయంలో దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారిణి మణి మాట్లాడుతూ దోమలు పెరగకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ● శృంగవరపుకోట: స్థానిక దేవీబొమ్మ కూడలిలో మంగళవారం దోమల నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, కొట్టాం పీహెచ్‌సీ వైద్యులు, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ● కొత్తవలస: పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చునని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం మసివానిపాలెం గ్రామంలో దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● బొండపల్లి: బొండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గొల్లలపేట, వేండ్రాం గ్రామాల్లో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ గోవిందరాజులు, సూపర్‌వైజర్ ఎస్‌ఏ.భాష, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయనగరం రింగురోడ్డు: సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు

● ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి

గజపతినగరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా విధులు నిర్వహించకుంటే తగు చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి హెచ్చరించారు. స్థానిక ఐసీడీఎస్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోగల కెంగువ, రామన్నపేట, వి.కృష్ణాపురం గ్రామాల్లోగల అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో అలసత్వం వహించడంపై తమ దృష్టికి వచ్చిందని, ఇక మీదట ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. అలాగే కొంతమంది అంగన్‌వాడీలు రాజకీయ నాయకుల నుంచి వేధింపులకు గురవుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారని, దీనిపై దర్యాప్తు చేపడతామని చెప్పారు. కేంద్రాలు సమయానికి తెరిచి, విధులు సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. కొంతమంది యూనియన్ల పేరు చెప్పుకుని విధులకు డుమ్మా కొడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పీవో నాగమణి, సూపర్‌వైజర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

రాజాం రూరల్: విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శాసపు సత్యనారాయణ కోరారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా మహారాష్ట్రలో పోరాటం చేసిన డా.నరేంద్ర దబోల్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని కంచరాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు జె.నీలయ్య, హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, పండూరు వేణుగోపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: పంచాయతీల్లో ఈనెల 23 నుంచి నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాస రావు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ ఎల్.శ్రీనివాసరావు, ఏపీవో సాయిరాం, అసిరియ్య. తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ సభ



సభలో మాట్లాడుతున్న డీఆర్పీ

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. ఈ సభలో గ్రామాల్లో జరిగిన పనులపై నామమాత్రంగా సమీక్షించి మమా అనిపించారు. గత కొన్నిరోజుల కిందట గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై పంచాయతీ పరిధిలో సమీక్షలు నిర్వహించారు. అప్పుడే ఉపాధిహామీ అధికారులు సర్పంచ్, ఎంపీటీసీలతో పనులు సక్రమంగా జరిగినట్టు ధ్రువీకరించుకున్నారు. దీంతో మంగళవారం జరిగిన సభలో గ్రామాల వారీ పనులు చదవడం, వాటిలో లోపాలు లేవని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఏపీవో విజయలక్ష్మీతోపాటు ఏపీడీ జనార్దనరావు, డీవీవో వెంకటరమణ, శ్రీనివాసరావు, డుమా ఏవో ధనుంజయరావు, క్వాలిటీ కంట్రోలర్ మనోహర్, ఎస్‌ఆర్‌పీ లక్ష్మణరావు, డీఆర్పీలు, సీఆర్పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

● సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు బదులుగా వారి ప్రతినిధులు హాజరైన వైనం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని 12 మంది ఎంపీటీసీలకుగాను ఐదుగురు హాజరు కాగా, మిగిలిన ఏడుగురు ఎంపీటీసీ ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే 29మంది సర్పంచ్‌లకుగాను ఏడుగురు గైర్హాజరు కాగా, ఐదుగురు హాజరయ్యారు. మిగిలిన 17 మంది సర్పంచ్ ప్రతినిధులే హాజరు కావడం గమనార్హం. ఈ సమావేశంలో సర్పంచ్ ప్రతినిధులే అధికంగా కలుగజేసుకుని సమస్యలపై మాట్లాడారు. పాఠశాలల్లో కిట్ల పంపిణీకి ఎందుకు ఆహ్వానం ఇవ్వలేదని ఎంపీపీతో పాటు పలువురు సర్పంచ్‌లు ఎంఈవో వినయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. సంగాంలో ఎండీఎం సిబ్బందిని, పలు చోట్ల పనివారిని కమిటీ తీర్మానం లేకుండా ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అనంతరం వివిధ శాఖలపై మొక్కుబడిగా సమీక్ష నిర్వహించి, మమా అనిపించారు. ఈసందర్భంగా ఎంపీడీవో త్రినాథరావు మాట్లాడుతూ సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచ్‌ల ప్రతినిధులు హాజరు కాకూడదని గతంలో నోటీసు జారీ చేశామని, కానీ మార్పు రాలేదన్నారు. అనంతరం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ మండలంలో చాలామంది నాయకులకు ఇప్పటికే గాలి పోయిందని, ఎవరూ భయపడనవసరం లేదన్నారు. నిబంధనలు అతిక్రమించి వంట నిర్వాహకులను తొలగిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఉచిత పశువైద్య శిబిరం

లక్కవరపుకోట: గేదెలవానిపాలెం గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ గోకుల్ మిషన్ ద్వారా గర్భకోశ వ్యాధులకు ఉచితంగా చికిత్స నిర్వహించి, మందులు అందజేసే కార్యక్రమం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు. 43 మంది రైతులకు చెందిన 72 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి తనిఖీలు నిర్వహించామని చెప్పారు. 12 పశువులకు సాధారణ తనిఖీలు నిర్వహించామని, ఉచితంగా మందులు అందజేసిన అనంతరం పశువులకు వ్యాక్సిన్ వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస సబ్ డివిజన్ ఏడీ గంగాధర్, జిల్లా వైద్యులు జగదీష్, భీమాలి, పశువైద్యులు సత్యనారాయణ, సర్పంచ్ కనకలక్ష్మి, టీడీపీ నాయకుడు దేముడు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

వేపాడ: వేపాడ-వల్లంపూడి గ్రామాల్లో బుధవారం తలపెట్టిన బంద్‌లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు దేబారికి కిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం వేపాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు రిజర్వేషన్ల వర్గీకరణపై ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బంద్ చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో దళిత నాయకులు మరియదాస్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

లోకేశ్‌ను కలిసిన బంగార్రాజు



భోగాపురం: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మంగళవారం ఉండవల్లిలో కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కిశోర్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నట్టు చెప్పారు. మండల శాఖ అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. మండల ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

సోలార్ విద్యుత్‌కేంద్రం ఏర్పాటుకు చర్యలు

గరివిడి: సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు రెండు ఎకరాలు దాటి ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఏపీ ఈపీడీసీఎల్ ఏడీఈ బీవీ రమణ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ బంగార్రాజుని కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి, అందులో సోలార్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని కోరారు. ఈ మేరకు చీపురుపల్లి నియోజకవర్గంలోగల 34 ఫీడర్లు పది సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అందించి, కరెంట్ కోతలు లేకుండా చూడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ సన్యాసినాయుడు, సీనియర్ లైన్‌మన్ శంకరరావు ఉన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

రేగిడి: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో వరప్రసాదరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆమదాలవలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. పిల్లల విద్యాప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలు, హాజరు శాతాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం, భవిత కేంద్రం నిర్వహణపై ఆయన ఆరాతీశారు. దివ్యాంగుల సంరక్షణపై ఐఈఆర్టీ ఉపాధ్యాయులకు ఆయన సూచనలు చేశారు. ఈ తనిఖీలో హెచ్‌ఎం వరుణకుమారి ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణా టీకాలు

సంతకవిటి: చిత్తారపురం గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణా టీకాలు వేశారు. పశుసంవర్ధక మండల అధికారి ఎస్.ఆశాకుమారి ఆధ్వర్యంలో సహాయకుడు వి.రాజారావు పశువులకు టీకాలు వేశారు. ఈ అవకాశాన్ని పాడి రైతులందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



నివాళులర్పిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.